శంభో శంకర.. శుభంకర

- భక్తుల కొంగు బంగారం అగస్త్యేశ్వరస్వామి
- వైభవంగా బ్రహ్మోత్సవాలు
- నాలుగు గాలిగోపురాలు ఆలయ ప్రత్యేకత



ప్రొద్దుటూరులోని అగస్త్యేశ్వరస్వామి ఆలయం

ప్రొద్దుటూరు కల్చరల్ : ఆలయాలు మన సంస్కృతి, నాగరికతకు నిలయాలుగా భాసిల్లుతున్నాయి. ప్రశాంత వాతావరణానికి దోహదకారి. పట్టణం నడిబొడ్డున వెలసిన శ్రీఅగస్త్యేశ్వరస్వామి ఆలయం ప్రాచీన దేవాలయాల్లో ఒకటి. భక్తులు కోరిన కోర్కెలు తీర్చే దేవతలుగా శ్రీఅగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరి అమ్మవారు ప్రసిద్ధి చెందారు. పూర్వం అగస్త్య మహాముని ఈ ఆలయంలో శివలింగాన్ని ప్రతిష్ఠించారు. అందువల్ల ఈ శివలింగాన్ని అగస్త్యేశ్వరస్వామిగా పిలుస్తూ భక్తులు ఆరాధ్య దైవంగా కొలుస్తున్నారు. ఈ ఆలయాన్ని 8వ శతాబ్దంలో తెలుగు చోళరాజు నిర్మించారు. 1498లో విజయనగర రాజు ఇమ్మడి నరసింహారాయలు సైనికాధికారి నరసానాయకుడు.. ఈ ఆలయాన్ని అభివృద్ధి చేశారు. 120 అడుగుల పొడవు, 140 అడుగుల వెడల్పుతో ఎత్తయిన ప్రాకారం, నాలుగు దిక్కుల రాజగోపురాలు నిర్మించారు. ఒక్కో రాజగోపురంపై సువర్ణమిశితమైన ఐదు కలశాలను ప్రతిష్ఠించారు. 1966లో కంచి కామకోటి పీఠాధిపతి చంద్రశేఖరేంద్ర సరస్వతి, 1988లో జయేంద్ర సరస్వతి.. అగస్త్యేశ్వరస్వామిని దర్శించుకుని రాజగోపురంపై బంగారు కలశాల ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవాలను నిర్వహించారు. తూర్పు రాజగోపురంపై పుష్పగిరి పీఠాధిపతి విద్యానృసింహ భారతీస్వామి బంగారు కలశాలను ప్రతిష్ఠించారు. ఉత్తర, దక్షిణ రాజగోపురాలపై బంగారు కలశాలను కంచి కామకోటి పీఠాధిపతి ప్రతిష్ఠ, కుంభాభిషేకాలను చేశారు. ఏటా వైశాఖ శుద్ధ సప్తమి నుంచి పది రోజుల పాటు బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు. అలాగే దేవీ శరన్నవ రాత్రులను ఘనంగా నిర్వహిస్తారు.

అగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరిదేవి ఆలయం

ఈ ఆలయాలకు ప్రత్యేక గుడి, గర్భగుడి, అంతరాలయాలు ఉన్నాయి. రెండు ఆలయాలను కలుపుతూ ఒకే ముఖ మండపాన్ని నిర్మించారు. మొదటి గర్భగుడిలో మూడు అడుగుల ఎత్తులో అగస్త్యేశ్వరస్వామిని లింగరూపంలో ప్రతిష్ఠించారు. రససిద్ధికి సంబంధించిన గుంటలు కూడా ఈ శివ లింగంపై ఉన్నాయి. అంతరాలయంలో వీరభద్రుడు, కార్తికేయుడు, గణపతి విగ్రహాలు ఉన్నాయి. వీరభద్రుడు సమభంగ స్థానంలో నిలుచుని 8 హస్తాలతో భక్తులకు దర్శనమిస్తున్నారు. కార్తికేయుడు నెమలిపై కూర్చుని 12 హస్తాలతో 6 తలలను కలిగి ఉన్నారు. ఎడమ వైపు గర్భగుడిలో రాజరాజేశ్వరి మాత భక్తులకు దర్శనమిస్తారు.

కోదండ రామస్వామి ఆలయం

ప్రధాన ఆలయానికి ఎడమ వైపున కోదండ రామస్వామి ఆలయాన్ని నిర్మించారు. గర్భగుడిలో సీతారాములు, లక్ష్మణుడు, ఆంజనేయస్వామి విగ్రహాలు ఉన్నాయి. శ్రీరాముడు అభయ ముద్రలో, సీతాదేవి కమలం చేతపట్టి ప్రసన్నంగా దర్శనమిస్తారు. వినాయకుడు, భీమలింగేశ్వరుడు, పార్వతీదేవి, సుబ్రమణ్యం, శంకరాచార్యులు, అయ్యప్పస్వామి బాలాలయాలు ఉన్నాయి. దక్షిణా మూర్తి, వీరభద్రుడు, కాలభైరవుడు, చండీశ్వరుడు, గాయత్రీమాత విగ్రహాలను ప్రతిష్ఠించారు.

'శివతాండవం'కు స్ఫూర్తి

14 భాషల్లో నిష్ణాతులైన శతాధిక గ్రంథకర్త పుట్టపర్తి నారాయణాచార్యులకు ఎనలేని కీర్తి ప్రతిష్ఠలు తెచ్చిన «శివతాండవం» కావ్య సృష్టికి మూలం ఈ ఆలయంలోని అగస్త్యేశ్వరుడే. నారాయణాచార్యులు ఆలయంలో కూర్చుని అంతర్గతంగా స్వామి వారిని దర్శిస్తూ అమితానందం పొందేవారట. రోజూ 101 ప్రదక్షిణలు చేసి శివతాండవం కావ్యాన్ని రచించారు. ఆలయ ప్రాంగణంలో పుట్టపర్తి నారాయణాచార్యుల స్మృతికి చిహ్నం ఏర్పాటు చేశారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

అగస్త్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 14 నుంచి 26 వరకు ఘనంగా నిర్వహిస్తున్నారు. రోజూ అగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరి అమ్మవారికి విశేష పూజాకార్యక్రమాలతోపాటు అలంకరణ, వాహనోత్సవం, సాయంత్రం 6 గంటలకు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెల 15న గంగా రాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరస్వామి వారి కల్యాణోత్సవాన్ని కమనీయంగా నిర్వహించారు. 23న రథోత్సవం, 24న వసంతోత్సవం, మధ్యాహ్నం 12 గంటలకు అన్నప్రసాద వినియోగం, 25న పవళింపుసేవ, 26న శాంత్యుత్సవం జరుగనున్నాయి.



విద్యుత్ దీపాలంకరణలో అగస్త్యేశ్వరస్వామి ఆలయం



అగస్త్యేశ్వరస్వామి మూలవిరాట్



రాజరాజేశ్వరి అమ్మవారు

పకడ్బందీ ఏర్పాట్లు



పారిశ్రామిక, వ్యాపార, సంగీత, సాహిత్యాది కళా రంగాలు, విద్య, వైద్య, ఆధ్యాత్మిక సేవలో ముందుకు నడిపిస్తున్న అగస్త్యేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నాం. ప్రొద్దుటూరుతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో వస్తున్నారు. వారి కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. – సి.శంకరబాలాజీ, కార్యనిర్వహణ అధికారి, సహాయ కమిషనర్, కడప

భక్తులు వేడుకల్లో పాల్గొనాలి



అగస్త్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నాం. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశాం. 23న రథోత్సవాన్ని నిర్వహిస్తాం. 24 మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వినియోగం జరగనుంది. భక్తులు పాల్గొని స్వామి, అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించాలి. – కొత్తమిద్దె రఘురామిరెడ్డి, అగస్త్యేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్, ప్రొద్దుటూరు

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు



రామాపురంలో వెలసిన మోక్ష నారాయణస్వామి ఆలయం

కమలాపురం: మండల పరిధిలోని రామాపురంలో నిత్య కళ్యాణ మూర్తులుగా వెలిసిన శ్రీమహాలక్ష్మి సమేత మోక్ష నారాయణ స్వామి, శ్రీ వల్లిదేవసేన సమేత ద్వికందర షణ్ముఖ సుబ్రమణ్యస్వామి వార్ల బ్రహ్మోత్సవాలు ఈనెల 21 నుంచి 25వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నారు. ఆలయ నిర్వాహకులు, పుణ్యభూమి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక, ప్రధాన సేవకులు సాయినాథశర్మ తెలిపారు. 21న ఉదయం గణపతి పూజతో ఉత్సవాలు ప్రారంభం కానున్నా యి. చివరి రోజు 25న మండప అర్చనలు, సమస్త పరివార దేవతామూర్తుల హోమాలు, పూర్ణాహుతి, పంచామృత స్నానం నిర్వహించనున్నారు. రాత్రి డాన్స్ బేబి డాన్స్ సంగీత కళాకారులచే ఆర్కెస్ట్రా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని వారు కోరారు.



మోక్షనారాయణ స్వామి మూలవిరాట్

అనుమతి లేకుండా టపాసులు విక్రయిస్తే చర్యలు



దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ, ఎస్ఐ

బద్వేలు అర్బన్ : అనుమతులు లేకుండా టపాసులు నిల్వ చేసినా, విక్రయించినా కఠినచర్యలు తప్పవని అర్బన్ సీఐ యుగంధర్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని పలు దుకాణాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం అర్బన్ స్టేషన్ ఆవరణలో వ్యాపారస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఎవరూ కూడా నిబంధనలకు విరుద్ధంగా టపాసులు విక్రయించరాదని సూచించారు. ఎన్నికల కోడ్ ముగిసేంత వరకు తనిఖీలు నిర్వహిస్తుంటామని, ఏ దుకాణంలోనైనా టపాసులు నిల్వ చేసి ఉంటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, వ్యాపారస్తులందరూ పోలీసులకు సహకరించాలని కోరారు. సమావేశంలో అర్బన్ ఎస్ఐ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలు



వల్లెరవారిపల్లెలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో కొలువైన శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 22వ తేదీ నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ బ్రహ్మోత్సవాల్లో 22వ తేదీన గణపతి హోమం, ధ్వజారోహణపూజ, 23న స్వామివారి తిరుకల్యాణం, చాందిని బండ్లు, స్వామివారి గ్రామోత్సవం, 24న బండలాగుడు పోటీలు ఉంటాయని వారు పేర్కొన్నారు. స్థానికులతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి ఈ బ్రహ్మోత్సవాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని ఆలయ పూజారి పెంచలయ్యస్వామి తెలిపారు. అన్నదాన కార్యక్రమంతోపాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఎల్లమ్మ జాతరకు సహకరించాలి

చెన్నూరు : చెన్నూరులో ఈ ఆదివారం జరగనున్న ఎల్లమ్మ జాతర ప్రశాంతతకు అందరూ సహకరించాలని సీఐ పార్థసారథి కోరారు, సోమవారం సాయంత్రం ఆయన చెన్నూరు పోలీస్ స్టేషన్ ఆవరణలో చెన్నూరు గ్రామంలోని ఇరువర్గాల గ్రామ పెద్దలు, శాంతి కమిటీ సభ్యులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా సీఐ పార్థసారథి మాట్లాడుతూ ఎల్లమ్మ జాతర సందర్భంగా ఊరేగింపులో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా చూడాల్సిన బాధ్యత శాంతి కమిటీ సభ్యులపై ఉందన్నారు,. చెన్నూరుపాడిపంటలతో పశువుల సంపదలతో ఎంతో ఆహ్లాదకరంగా ఉండే గ్రామమని, ఇలాంటి తరుణంలో ఎలాంటి సమస్యలకు తావివ్వకుండా ఇందుకు సంబంధించి అందరి సహకారం ఉండాలని వారికి సూచించారు, జాతరలో పర్యవేక్షించడానికి డీఎస్పీతోపాటు సీఐలు, ఎస్ఐలు. పోలీసులు బందోబస్తుగా ఉంటారని తెలియజేశారు. ఈ సమావేశంలో వైఎస్ఆర్ సీపీ నాయకులు ముదిరెడ్డి సుబ్బారెడ్డి , అన్వర్ బాషా, మునీర్ అహ్మద్, వారిస్, హస్రత్, జుమస్, షబ్బీర్ ఆకుల ప్రసాద్ బాబు. పలువురు శాంతి కమిటీ సభ్యులు హాజరయ్యారు.

వైభవంగా మంచాలమ్మ జాతర

కమలాపురం: మండల పరిధిలోని టి.చదిపిరాళ్ల–గొల్లపల్లె గ్రామాల మధ్య వెలసిన పాలేటి గంగమ్మ (మంచాలమ్మ) తిరుణాల మహోత్సవం వైభవంగా నిర్వహించారు. సోమవారం ఆలయ కమిటీ సభ్యులు, ఆయా గ్రామాల ప్రజల ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ముందుగా అమ్మవారికి, మహా గణపతి పూజ, ప్రధాన కలశ స్థాపన, అనంతరం పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సమీప గ్రామాల నుంచి తరలి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఉత్సవాల సందర్భంగా మూడు పూటల అన్నదానం చేశారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో అమ్మవారిని ఆయా గ్రామాల్లోని పుర వీధుల్లో ఊరేగించారు. చెక్కభజన తదితర కార్యక్రమాలు అలరించాయి.

బండలాగుడు పోటీలు: తిరుణాల పురస్కరించుకుని ఏర్పాటు చేసిన బండలాగుడు పోటీలు రసవత్తరంగా సాగాయి. వివిధ ప్రాంతాల కు చెందిన 15 కాండ్ల పాల పళ్ల ఎద్దులు పాల్గొన్నాయి.

రేపు మండల సమావేశం

బద్వేలు అర్బన్ : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో బుధవారం ఎంపీపీ బిజివేముల రమణమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రజనీకాంత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గృహనిర్మాణశాఖ, తాగునీటి సమస్య తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చించడం జరుగుతుందని, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్లు, కో ఆప్షన్ సభ్యులతోపాటు అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని ఆయన పేర్కొన్నారు.

కాశినాయన మండలంలో..

కాశినాయన : స్థానిక మండల పరిషత్ సభాభవనంలో బుధవారం ఉదయం 10–30 గంటలకు ఎంపీపీ నల్లేరు పోలమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మధుసూదన్రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో తాగునీరు, ఉపాధి హామీ పథకం, వ్యవసాయం, విద్యుత్ అంశాలతోపాటు వివిధ అంశాలపై చర్చ జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు తమ నివేదికలతో హాజరు కావాలన్నారు. అలాగే ఎంపీటీసీలు, సర్పంచ్లు, పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

జీలగలు, జనుములకు రిజిస్ట్రేషన్ చేయించుకోండి

బి.కోడూరు : జీలగలు, జనుములకు సంబంధించి రైతులు సమీప రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి టి.కౌశిక తెలిపారు. జీలగలు, జనుములు కావాల్సిన రైతులు ఆధార్కార్డు, పాసుపుస్తకంతోపాటు మొబైల్ను తీసుకువచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆమె పేర్కొన్నారు. 10 కేజీల జీలగలు రైతువాటా రూ.440, జనుములు 10 కేజీలు రైతు వాటాగా రూ.440 చెల్లించాలన్నారు.

నేడు మారెమ్మ తల్లి వార్షికోత్సవం

సింహాద్రిపురం : మండలంలోని రావులకొలను గ్రామంలో వెలసిన శ్రీ మారెమ్మ తల్లి అమ్మవారి తొమ్మిదో వార్షికోత్సవం మంగళవారం నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ఈ వార్షికోత్సం పురస్కరించుకుని అమ్మవారికి గణపతి పూజ, పంచామృతాభిషేకం, ప్రత్యేక అలంకరణ, కుంకుమార్చన నిర్వహించడంతో పాటు ఉదయం నుంచి రాత్రి వరకు అన్నదాన కార్యక్రమం, రాత్రి కోలాటం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. గ్రామ సుభిక్షం కోసం బుధవారం అమ్మవారికి బోనాలు సమర్పిస్తారన్నారు. ప్రజలు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని వారు తెలిపారు.

ఘనంగా బసవేశ్వరుడి జయంతి

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని ఉమామహేశ్వర స్వామి (బసవన్నకట్ట) ఆలయంలో సోమవారం బసవ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వీరశైవ గురుజంగమ లింగాయతి సంఘం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఉదయం బసవేశ్వరునికి ఆలయ అర్చకులు భీమలింగస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఎడ్లబండిపై బసవేశ్వరుని చిత్రపటాన్ని ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు.

తెప్పోత్సవాలకు వేళాయె..

- నేటి నుంచి కడప రాయుడి తెప్పోత్సవాలు
- పూర్తయిన ఏర్పాట్లు

కడప కల్చరల్ : కడప రాయుడు శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక తెప్పోత్సవాలు మంగళవారం నుంచి మూడు రోజులపాటు జరగనున్నాయి. జిల్లాలో అత్యంత పురాతనమైన ఆలయాలలో కడప రాయుని ఆలయం ఒకటి. చారిత్రకంగా, ఆధ్యాత్మికంగా ఈ క్షేత్రానికి ఎంతో పేరుంది. జనవరి చివరిన బ్రహ్మోత్సవాలు, మే మాసంలో తెప్పోత్సవాలు జరుగుతాయి. మంగళ, బుధ, గురు వారాలలో జరగనున్న తెప్పోత్సవం కోసం ఇప్పటికే తిరుపతి నుంచి ప్రత్యేకంగా తెప్పను తెప్పించి ఉంచారు. పుష్కరిణిలోని నీటిని మూడు రోజుల క్రితం పూర్తిగా తొలగించారు. ప్లాట్ఫామ్కు సమంగా ఉండేలా బోర్ల నుంచి నీటిని నింపుతున్నారు. ఆలయంలో కూడా పూర్తిగా రంగురంగుల చలువ పందిళ్లు వేసి భక్తులకు వేసవి బాధలు లేకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకున్నారు.

కోనేటి చరిత్ర..

కడప రాయుని కోనేటి (పుష్కరిణి)కి చరిత్ర ఉంది. జిల్లాలోని పలు దేవాలయాల వద్ద కోనేర్లను మనం గమనించవచ్చు. అందులో ఈ పుష్కరిణికి విశిష్టమైన చరిత్ర ఉంది. చూడటానికి, వ్యవహారంలోనూ ఈ పుష్కరిణి కేవలం శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయానికి చెందినదేనని భావిస్తారు. కానీ ఆలయం ఎదురుగా అత్యంత సమీపంలో ఉన్న శ్రీ సోమేశ్వరస్వామి గుడికి ఈ పుష్కరిణి ఆనుకుని ఉండడం విశేషం. దీంతో ఈ పుష్కరిణి దేవునికడప శివాలయానికి కూడా చెందినదని కొందరు పెద్దలు తెలుపుతున్నారు.

- జిల్లాలో పెద్దదైన కడప రాయుని పుష్కరిణిని విజయనగర సామ్రాజ్య పాలకులు, సంఘమ వంశీయులు, ప్రౌఢ దేవరాయలు 1442లో దుందుభి నామ సంవత్సరం భాద్రపద శుద్ధ ఏకా దశి నాడు పుష్కరిణి తవ్వకం పనులను ప్రారంభించినట్లు శాసనాధారాలు ఉన్నాయి. పలువురు వాస్తు పండితులు నిర్మాణ రంగంలో నిపుణులైన వారితో చర్చించి ఈ కోనేరును నిర్మించారని తెలుస్తోంది. ఈ వివరాలన్నీ ఆలయ రంగమండపంలో మొన్నటివరకు శిలా శాసనంలో ఉండేవని కడప కైఫీయత్తుల ద్వారా తెలుస్తోంది. 1810–15 ప్రాంతంలో కల్నల్ మెకంజీ వద్ద రెవెన్యూశాఖలో పనిచేసిన ఉద్యోగి నారాయణరావు జిల్లాలోని శాసనాలు, వాటి వివరాలను గ్రంథంగా ప్రచురించారని కై ఫీయత్తులలో పొందుపరిచారు. దేవుని కడప ఆలయ రంగమండపంలో పుష్కరిణి నిర్మాణ వివరాలను తెలిపే శిలా శాసనం ఉండేదని, నారాయణరావు పరిశీలించినప్పటికే అది పగుళ్ల బారి ఉండిందని తెలుస్తోంది. ఈ వివరాల ప్రకారం దేవునికడప ఆలయ పుష్కరిణి అత్యంత పురాతనమైనదిగా చెప్పవచ్చు.



దేవుని కడప పుష్కరిణి

ఉత్సవాల వివరాలు

మంగళవారం రాత్రి 7.00 గంటల నుంచి శ్రీ గోదాదేవి సమేత శ్రీకృష్ణుడు పుష్కరిణిలో మూడు మార్లు విహరించనున్నారు. బుధవారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఐదుమార్లు, గురువారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఏడుసార్లు పుష్కరిణిలో తెప్పపై విహరించనున్నారు. భక్తులు పాల్గొని, చూసి తరించాలని దేవదాయ శాఖ అధికారులు కోరారు.

క్లుప్తంగా

నిత్యావసర వస్తువుల వితరణ



ఆశ్రమానికి నిత్యావసర సరుకులు అందిస్తున్న సీఐ, ఎస్ఐలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక మదర్ థెరిస్సా సేవా వృద్ధాశ్రమానికి ఆర్కే హెల్పింగ్ హ్యాండ్స్ కువైట్ వారి సహకారంతో మీ కోసం సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం రూ.20 వేలు విలువ చేసే నిత్యావసర వస్తువులు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రూరల్ సీఐ రమణారెడ్డి మాట్లాడుతూ జీవనోపాధి కోసం కువైట్ తదితర విదేశాలకు వెళ్లి జీవనం సాగిస్తూ, ఆర్కే హెల్పింగ్ హ్యాండ్స్ కువైట్ సమూహంగా ఏర్పడి వచ్చిన ఆదాయంలో కొంత భాగం రాష్ట్రంలోని 11 ఆశ్రమాలకు, జిల్లాలోని 5 ఆశ్రమాలకు సహాయం చేయడం అభినందనీయమన్నారు. పోలీస్ డిపార్ట్మెంట్ నుంచి ఆశ్రమాలకు తమ వంతు సహాయం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్ఐలు చిరంజీవి, శివప్రసాద్, స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు మురళి, వ్యాపారవేత్త వేములపాటి సూర్యానారాయణరెడ్డి, మీకోసం సేవా సంఘం అధ్యక్షుడు విష్ణువర్ధన్, ఎన్వైకే వలంటీర్ నరేష్, ఆదరణ సేవా సంస్థ అధ్యక్షుడు సత్యానారాయణ, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

అన్నదానం



భోజనం వడ్డిస్తున్న శెట్టిపల్లె రాంప్రసాద్రెడ్డి

ప్రొద్దుటూరు : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం శివోహం అన్నప్రసాద సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సంఘం అధ్యక్షుడు శెట్టిపల్లె రాంప్రసాద్రెడ్డి, కవిత దంపతుల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాంప్రసాద్రెడ్డి మాట్లాడుతూ రెండున్నరేళ్లుగా శివోహం అన్నప్రసాద సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. సభ్యులు, ప్రజల సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో శివోహం సేవా సంఘం కమిటీ సభ్యులు మురుకూటి సూర్యానారాయణరెడ్డి, విష్ణు నారాయణ, విజయకుమార్, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానసిక వికాసానికి దోహదం



జిరాఫీ చెస్ గురించి వివరిస్తున్న గంగాధర్రెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : మానసిక వికాసానికి సోపానాలు విజ్ఞాన శిబిరాలు అని ఉపాధ్యాయురాలు నిర్మల జ్యోతి తెలిపారు. స్థానిక వసంతపేటలోని మున్సిపల్ హైస్కూల్లో సోమవారం బాలబలబాలికల గ్రంథాలయం ఆధ్వర్యంలో చిన్నారులకు వేసవి శిక్షణా తరగతులు నిర్వహించారు. ఉపాధ్యాయురాలు నిర్మలజ్యోతి విద్యార్థులకు పురాణాల నుంచి విష్ణువు అవతారాలు, దశావతారాల గురించి వివరించారు. రాయలసీమ వ్యాయామ విద్య కాలేజి గ్రంథాలయాధికారి గంగాధర్రెడ్డి జిరాఫీ చెస్ గురించి వివరించి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ ఇబ్రాం సాహెబ్, రెహ్మాన్ ఖాన్, సారమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఊరేగింపులు, ర్యాలీలకు అనుమతి లేదు



డీఎస్పీ టి.వెంకటేశులు

మైదుకూరు : మైదుకూరు, బద్వేలు నియోజకవర్గాల్లో జూన్ 6వ తేదీ వరకు ఎలాంటి ఊరేగింపులు, ర్యాలీలకు అనుమతి లేదని మైదుకూరు డీఎస్పీ వెంకటేశులు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ముగిసే వరకు 144 సెక్షన్, 30 పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని ఆయన పేర్కొన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు ఎవరు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల కౌంటింగ్ ముగిశాక, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ముగిసిన అనంతరం విజ్ఞప్తులను పరిశీలించి ర్యాలీలకు, ఊరేగింపులకు అనుమతి ఇస్తామని డీఎస్పీ తెలిపారు. రెండు నియోజకవర్గాల్లో నలుగురికి మించి గుమికూడవద్దని పేర్కొన్నారు. మైదుకూరు, బద్వేలు పట్టణాల్లో అన్ని రకాల దుకాణాలను రాత్రి 9 గంటలకు మూసివేయాలని స్పష్టం చేశారు. ట్రబుల్ మాంగర్లు ఎలాంటి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జిమ్ సెంటర్ ఏర్పాటు

పులివెందుల : పులివెందుల పట్టణంలో మహిళల కోసం నూతన టెక్నాలజీతో జిమ్ సెంటర్ను ప్రారంభించారు. సోమవారం వైఎస్సార్సీపీ కార్యకర్త వినయ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిమ్ సెంటర్ను కౌన్సిలర్ విజయ్కుమార్ నాయుడు, వైఎస్సార్సీపీ నాయకులు రమేష్నాయుడు ప్రారంభించారు.